క్లుప్తంగా

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



గట్టు : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ సలీముద్దీన్, ఆర్ఐ రాజులు పరిశీలించారు. బీసీ కాలనీ 5వ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఇటీవల కాలనీ వాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారుల సూచన మేరకు గట్టు బీసీ కాలనీలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. వివరాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కార్యనిర్వాహక కార్యదర్శిగా శివకుమార్



అలంపూర్ : తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా శివకుమార్ ఎంపికయ్యారు. హైదరబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో అలంపూర్ ఆస్పత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌ను కార్యదర్శిగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీయుద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడు శాంతి కుమార్ గౌడ్‌ల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

శాంతినగర్ : ఇంటి ముందు నిల్చున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు అపహరించిన సంఘటన స్థానిక రవీంద్ర ఉన్నత పాఠశాల సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బాధిత మహిళ రవీంద్ర పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాల్‌రావు సతీమణి రత్నకుమారి వివరాల ప్రకారం.. ఇంటి ముందు ముగ్గు వేస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు మెడలోని బంగారు గొలుసు తెంపుకుని పరారైనట్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

పూజా సామగ్రి పంపిణీ

శాంతినగర్ : వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లోని దత్తాత్రేయ స్వామి ఆలయ సమూహంలోని శివాలయానికి మంగళవారం పూజా సామగ్రిని అందజేశారు. వేద విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల్లోని ఆలయాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు శ్రీవారి సేవకులు గాయత్రి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో మాణిక్యం, హిమబిందు, శివస్వామి పాల్గొన్నారు.

పాఠశాలకు రక్షణ కరువు



అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంపౌండ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల మైదానాల్లో అసాంఘిక కార్యక్రమాలు పేట్రేగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో పరీక్ష కేంద్రంగా కొనసాగుతున్న జెడ్పీహెచ్ఎస్ పాఠశాల కంపౌండ్‌కు ఉన్న రంధ్రాన్ని మూసివేయట్లేదు. వీటి వ్యవహారంలో అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూమీడియం ఉన్నత పాఠశాలకు చెందిన కంపౌండ్‌ను సైతం కూలగొట్టారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపోవడంతో పాఠశాల మైదానాల్లో ఎలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయో అర్థం కావడం లేదని ఆయా పాఠశాల సమీప ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపౌండ్‌కు మరమ్మతు చేపట్టి రాత్రి వేళల్లో పాఠశాలల వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

తెల్లబోయిన ఎర్ర బంగారం

- నల్లతామర పురుగుతో దెబ్బతిన్న మిర్చి పంట
- గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వేడుకోలు



తెల్లకాయను ఏరుతున్న కూలీలు



ఉండవెల్లిలో తెగులు సోకిన మిర్చి పంట

ఉండవెల్లి: అలంపూర్ నియోజకవర్గంలో మిర్చి పంట వేసిన రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నల్లతామర పురుగుతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతింది. ఆశించినంత దిగుబడి రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పెట్టుబడి విపరీతంగా పెరగడం, గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

27 వేల ఎకరాల్లో మిర్చి సాగు..

అలంపూర్ నియోజకవర్గంలో 27 వేల ఎకరాలకు పైగా రైతులు మిర్చి సాగు చేశారు. పంట నల్లతామర పురుగు బారిన పడి దిగుబడి రాక, మిర్చి తెల్లగా మారుతుండటంతో ఆందోళనలో ఉన్నారు. ఎకరాకు 20 క్వింటాళ్లు కూడా దిగుబడి రాని పరిస్థితి ఉందని వాపోతున్నారు. దీనికి తోడు గిట్టుబాటు ధర లభించక లబోదిబో మంటున్నారు. గత రెండేళ్ల క్రితం మంచి డిమాండ్ ఉండగా ఈ ఏడాది పరిస్థితి మారింది. క్వింటా రూ.10 నుంచి రూ.12 వేలు మాత్రమే పలుకుతుందని పేర్కొన్నారు. మిర్చి అమ్మాలంటే కర్నూల్, గుంటూరు, హైదరాబాద్ మార్కెట్‌లకు వెళ్లాల్సిందే అంటున్నారు. దీనికి తోడు ఎండలు ముదురుతుండటంతో కాయ తెల్లగా మారుతుందని వాపోతున్నారు. కూలీలకు, ఎరువులకు, రవాణా ఖర్చులు కూడా రెట్టింపు అయినట్లు పేర్కొన్నారు. అధికారులు మిర్చి పంట పరిశీలించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయాం..



మిర్చి పంటకు నల్లిపురుగు ఆశించడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు ఈ ఏడాది గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం నేరుగా మిర్చి రైతులకు నష్టపరిహారం అందించాలి.

– మల్లయ్య, రైతు, ఉండవెల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి....



మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరల తగ్గుదల, దిగుబడి రాక, ఖర్చులు అధికం కావడంతో అప్పుల పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకుని నష్టపరిహారం అందజేయాలి.

– ఈదన్న, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

మహనీయుల చరిత్ర తెలుసుకోవాలి



గద్వాలలోని పార్టీ కార్యాలయంలో దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాలటౌన్ : మహనీయులు జీవిత చరిత్రలు తెలుసుకుంటూ వారి ఆశయాలు కొనసాగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం స్థానిక డీకే బంగ్లాలో నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్ ఏక్బోటే, రామంజనేయులు, అక్కల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ జీవితం ఆదర్శం..

అలంపూర్ : బీజేపీని విజయపథంలో నడిపించిన పండిత్ దీన్ దయాళ్ జీవితం ఆదర్శమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శరత్ బాబు అన్నారు. అలంపూర్ పట్టణంలో బీజేపీ అధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఏకాత్మ మానవతా వాదాన్ని ప్రవచించి అంత్యోదయ విధానాన్ని రూపొందించిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగమల్లయ్య, రంగస్వామి, బంగారు లక్ష్మణ్, సత్యారెడ్డి, కృష్ణ, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

మల్దకల్ : విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని డీఆర్‌డీఏ ఈజీఎంఎం శిక్షకుడు మహేష్, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు వివరించారు. ప్రతి విద్యార్థి తమ సందేహాలను తరగతి గదిలోనే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మహేష్

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అయిజ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని మార్కెట్ సముదాయంలో అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలియజేశారు. కార్యక్రమంలో వేమన్న, తాహేర్, అంజనేయులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో బంగారు పతకం

అయిజ: పట్టణానికి చెందిన మారుతి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బ్లాక్ బెల్ట్ విద్యార్థి ప్రదీప్ సాగర్ ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థి ప్రదీప్ సాగర్‌ను మాస్టర్ మధుకుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ట్రైనర్ నవదీప్ సాగర్, తాయిక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు.



సాగర్‌ను అభినందిస్తున్న మాస్టర్ మధుకుమార్

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

ఆత్మకూర్/అమరచింత: ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య అందుతుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పదో తరగతి అనంతరం విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం డీఐఈఓ అంజయ్య, ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి సూచన మేరకు స్థానిక ప్రభుత్వ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు కురుమూర్తి, కెమిస్ట్రీ అధ్యాపకుడు బుచ్చయ్య అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో పర్యటించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలుగు, ఆంగ్లంలో విద్యా బోధనలు జరుగుతున్నాయని, ఒకేషనల్ కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రైవేట్ కళాశాల్లో చేరి తల్లిదండ్రులకు ఆర్థిక భారం కలిగించకుండా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్‌కు అడ్మిషన్ డ్రైవ్ సందర్భంగా వినతి పత్రాన్ని అందించారు.



ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు

గ్రామీణ ప్రజలకు ప్రయాణ కష్టాలు



అలంపూర్ చౌరస్తా వద్ద ప్రయాణికుల రద్దీ

అలంపూర్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ కష్టాలు తప్పడం లేదు. గమ్య స్థానం చేరుకోవడానికి అపసోపాలు పడాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ రోడ్డు మార్గంలో ప్రయాణం చేసే ప్రయాణికులకు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలీ చాలని సర్వీసులు నడుపుతుండటంతో రోడ్డుపైనే గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శిస్తున్నారు. ప్రత్యేక ఉత్సవాలు ఉన్న సమయాల్లో బస్సు సర్వీసులు పెంచాలని కోరుతున్నారు.

ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో సబ్జెక్ట్ మేళా

కేటీదొడ్డి: వినూత్న బోధన చేపట్టేందుకు విద్యార్థులకు సబ్జెక్ట్ మేళా దోహదపడుతుందని హెచ్ఎం చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఎర్సన్‌దొడ్డి గ్రామ పాఠశాలలో మంగళవారం ఎంవీఎఫ్, విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలుగు, గణితం సామాన్య శాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ల వారీగా సబ్జెక్ట్ మేళా నిర్వహించి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ సభ్యులు రాజు, సాయికుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

అయిజ: మండలంలోని కేశవరంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా గంగపూజ, హోమం, అభిషేకాలు, పల్లకీ సేవా తదితర క్రతువులు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు. రాత్రి ప్రభోత్సవం కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం మెరుగు

నర్వ: నిత్య ధ్యానంతో ఆరోగ్యం మెరుగవుతుందని హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ సమన్వయకర్తలు నారాయణ, సత్యనారాయణ, శివకుమార్ అన్నారు. మూడు రోజులుగా జక్కన్నపల్లి గ్రామంలో ఏకాత్మాభియాన్‌లో భాగంగా ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ధ్యానులు ఎల్లప్పుడు ఆరోగ్యంగా, ఆధ్యాత్మికంగా ఉత్తమ మార్గంలో నడుస్తారన్నారు. కార్యక్రమంలో జక్కన్నపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కోట్ల నాగిరెడ్డి, కొంకల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను సంరక్షిద్దాం



మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్‌లైన్ వర్కర్ నవీన్



మద్దూరులో అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ

అలంపూర్ : సమాజంలో బాలల హక్కులను సంరక్షిద్దామని చైల్డ్ హెల్ప్‌లైన్ వర్కర్ నవీన్ అన్నారు. పట్టణంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్ప్ లైన్ వర్కర్ మాట్లాడుతూ.. దేశంలో బాలల సంరక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలు 24 గంటలపాటు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బాలల సంరక్షణ కమిటీలు ప్రతి నెల రెండో మంగళవారం సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశాల్లో ఆడపిల్లల రక్షణ, విద్య, వివక్ష, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, బాలకార్మిక వ్యవస్థ, సెల్‌ఫోన్ వల్ల కలిగే అనార్థాల గురించి వివరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు పోషణ చాలా అవసరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పోషక ఆహారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా బాలికలలో శారీరక ఎదుగుదలలో మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ సమావేశం..

అయిజ: మండలంలోని ఉత్తనూరులో మహిళ శిశు సంక్షేమ శాఖ సభ్యులు బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాలల సరంక్షణ అధికారి నరసింహులు మాట్లాడారు. బాలల పరిరక్షణ కమిటీ అనేది గ్రామ, మండల, జిల్లాలో కొంతమంది వ్యక్తులతో ఏర్పడే బృందమన్నారు. బాలలపై వేధింపులు, అకృత్యాలు, హింస జరుగకుండా ఉండడంతో పాటు పిల్లలంతా ఆనందంగా ఉండేలా మార్చడం కమిటీ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

మానవపాడు: బాలలపై లైంగిక వేధింపులు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ, భరోసా కోఆర్డినేటర్ శివాని అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో బాలల హక్కులు గురించి అవగాహన కల్పించారు. ఆడపిల్లలతో సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్ మానికమ్మ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన..

ఎర్రవల్లి: మండల పరిధిలోని కోదండాపురం గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల, కోదండాపురం ఎస్ఐ స్వాతి బాలల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలల సంరక్షణ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, బీహెచ్‌యూడబ్ల్యూ కోఆర్డినేటర్లు జ్యోత్స్న, చిట్టెమ్మ, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ సరాగిని తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: విద్యార్థులు స్నేహపూర్వక గ్రామంగా మాన్‌దొడ్డిని తీర్చిదిద్దాలని ఓఆర్‌డబ్ల్యూ(చైల్డ్ వెల్ఫేర్ అధికారి)లక్ష్మి అన్నారు. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామ పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కీచక ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: టీచర్లను వేధించడమే కాకుండా విద్యార్థులపై అనుచితంగా వ్యవహరిస్తున్న బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి తక్షణమే విధుల నుంచి తొలగించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీచుపల్లి గురుకుల పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతులు సైతం సక్రమంగా లేవని మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణకు ప్రిన్సిపాల్‌ను తొలగించాలని ఫిర్యాదు పత్రం అందజేశారు కార్యక్రమంలో నాయకులు నర్సింహా, తిరుపతయ్య, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గట్టు : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీ, సీడీఆర్, ఇమ్యూనైజేషన్‌పై చర్చించారు. బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధుల గుర్తింపు, నమోదు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటాద్రినాయుడు, ఎంపీహెచ్ఎస్ సూపర్‌వైజర్ శకుంతల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షను నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలి



ఉదండాపూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న రవికుమార్

ఇటిక్యాల: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా దుకాణ యజమానులు రశీదులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాతర్ల, ఉదండాపురం గ్రామాల్లోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. అనుమతులు లేని మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల అవసరాల మేరకు మండలంలో 535 టన్నుల యూరియా, 48 టన్నుల డీఏపీ, 91 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

14 నుంచి రాజావళి ఉర్సు

అమరచింత: పట్టణంలో వెలసిన రాజవళీ దర్గా ఉర్సు ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. 14న గంధోత్సవం, 15న తాజేచిరాక్, 16న ఖత్మేఖురాన్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వారు పేర్కొన్నారు. ఉర్సు సందర్భంగా చాదర్ ఊరేగింపుతో పాటు ఆల్ఇండియా కృష్ణ, మహేష్ బాబు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ ఘోరీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.



ముస్తాబైన రాజావళి దర్గా

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కొత్తకోట (ఆత్మకూర్): సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని మొట్లంపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందుకు రావాలని, స్వచ్ఛందంగా విరాళాలు అందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈసందర్భంగా గ్రామస్తులు రూ.50 వేలు సమకూర్చి ఎస్ఐకు అందజేశారు.



ఎస్ఐకు విరాళం అందజేస్తున్న గ్రామస్తులు